క్లుప్తంగా

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం


తుంగ్లాంలో పద్మశాలి సంఘం నాయకులను సన్మానిస్తున్న సభ్యులు

అక్కిరెడ్డిపాలెం: పద్మశాలి సంఘం సమావేశం జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలో జరిగింది. మార్కండేయ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు జాగారపు శ్రీనివాసరావు, విశాఖ జిల్లా అధ్యక్షుడు పప్పు రాజారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మాట్లాడుతూ పద్మశాలీల సమస్యలను ఐక్యతతో పరిష్కరించుకోవాలని తెలిపారు. అనంతరం సంఘం నాయకులను ఘనంగా సన్మానించారు. గౌరవ అధ్యక్షుడు నావాన సింహాచలం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కొల్లి కుంచారావు, జి.అప్పారావు, పి.కనకారావు, ఎస్.సంతోష్, ఎం.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలి.

వైభవంగా అప్పన్న నిత్య కల్యాణం


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: సింహగిరి వరాహ లక్ష్మీనృసింహ స్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను అధిష్టింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అర్చకులు అందజేశారు.

నేడు పోలిపల్లమ్మ పండగ



సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు అప్పన్నపాలెంవాసుల ఆరాధ్య దేవత పోలి పల్లమ్మ తల్లి వార్షికను మంగళవారం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు పీతల విష్ణుమూర్తి తెలిపారు. ఆలయం వద్ద భక్తులకు మజ్జిగ, ప్రసాద వితరణ చేస్తున్నట్టు చెప్పారు. రాత్రి అనుపు మహోత్సవాన్ని పురస్కరించుకుని గరగల డ్యాన్స్, బాణసంచా భారీ ఎత్తున కాల్చడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. సాయంత్రం నుంచి మూడు వేదికలపై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పండగ నేపథ్యంలో అమ్మవారి ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఆలయ కమిటీ కార్యదర్శి ఉరివిడి ఈశ్వరరావు, ట్రెజరర్ నూనెల దేముడు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నమో శివరుద్రాయ

సింహాచలం: విజినిగిరిపాలెంలోని ఉమా చంద్ర మౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం పరమేశ్వరుడికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వ పత్రాలతో పూజలు చేశారు. ఉమాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమపూజలు నిర్వహించారు. శివ నామస్మరణలో మునిగితేలారు.

పోలింగ్ ప్రశాంతం

- గాజువాకలో 61.14 శాతం
- మందకొడిగా మొదలై జోరందుకున్న వైనం

గాజువాక: ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గాజువాక నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ ప్రారంభం నుంచి ముగింపు వరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. పెదగంట్యాడ, గాజువాక మండలాల పరిధిలో మొత్తం 20,205 మంది ఓటర్లుండగా, వారిలో 12,385 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మొత్తం 61.14 శాతం పోలింగ్ నమోదైనట్టు రిటర్నింగ్ అధికారులు తెలిపారు. రెండు మండలాల్లోను 18 పోలింగ్ కేంద్రాల ద్వారా ఓటర్లు పోలింగ్‌లో పాల్గొన్నారు.

పోలింగ్ ఇలా..

గాజువాక మండలంలో మొత్తం 16,404 మంది ఓటర్లకుగాను గాజువాక, అక్కిరెడ్డిపాలెం, కణితి జిల్లా పరిషత్ హైస్కూళ్లలో 13 పోలింగ్ కేంద్రాలు, ఉక్కునగరంలోని విశాఖ విమల విద్యాలయంలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 60.49 శాతం పోలింగ్ జరిగినట్టు ఇన్‌చార్జి తహసీల్దార్ కె.త్రినాథరావు తెలిపారు. పెదగంట్యాడ మండలంలో 3,801 మంది ఓటర్లకుగాను మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వారిలో 2,462 మంది ఓటర్లు ఓటు వేశారు. ఈ మూడు కేంద్రాల్లోను మొత్తం 64.77 శాతం మంది ఓటు వేసినట్టు మండల తహసీల్దార్ తెలిపారు.

మందకొడిగా మొదలై..

- నియోజకవర్గంలో పోలింగ్ మందకొడిగా మొదలైంది. ఎనిమిది గంటల నుంచి 11 గంటల వరకు 15 శాతం నమోదైన పోలింగ్ రెండు గంటల సమయానికి 40 శాతానికి చేరుకున్నట్టు అధికారులు తెలిపారు. పోలింగ్ ముగిసే సమయానికి అది 61.14 శాతానికి చేరుకుంది.
- గాజువాక హైస్కూల్లో రాత్రి ఏడు గంటల వరకు పోలింగ్ కొనసాగింది. బ్యాలెట్లు ఇవ్వడంలోను, మడత పెట్టడంలోను ఆలస్యం చోటు చేసుకున్నట్టు పలువురు ఓటర్లు ఆరోపించారు.
- 216, 217 పోలింగ్ కేంద్రాల్లో అధిక సంఖ్యలో ఓటర్లు ఉండటంతో పోలింగ్ ఆలస్యమైనట్టు అధికారులు తెలిపారు. ఈ పోలింగ్ బూత్‌లలో బ్యాలెట్ బాక్సులు నిండిపోవడంతో కొత్తవాటిని తెచ్చి పెట్టడానికి గంటల పాటు పోలింగ్ నిలిపివేసినట్టు ఓటర్లు తెలిపారు.
- గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు కష్టపడాల్సి వచ్చింది. దీంతో జోగవానిపాలెం నుంచి హైస్కూల్ రోడ్ అనుసంధానానికి సంబంధించిన రోడ్డుకు అడ్డంగా ఆటో నిలిపివేసి ట్రాఫిక్‌ను ఆపారు. హైస్కూల్ రోడ్డులో కూడా కొద్దిసేపు వాహనాల రాకపోకలను నిలిపివేశారు.
- పోలింగ్ సరళిని జిల్లా జాయింట్ కలెక్టర్, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ తదితరులు పర్యవేక్షించారు. గాజువాక హైస్కూల్లో ఇద్దరు డీసీపీలు సహా పలువురు అధికారులు, సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు.
- ఇక్కడి పోలింగ్ కేంద్రాలను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, బీజేపీ అభ్యర్థి పీవీఎన్ మాధవ్, టీడీపీ అభ్యర్థి చిరంజీవి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు తదితరులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా తమ కార్యకర్తలతో మాట్లాడి ఓటింగ్ సరళిని తెలుసుకున్నారు.
- ఓటు ఒకచోట, పోలింగ్ బూత్ అడ్రస్ ఒకచోట ఉండటంతో పలువురు ఓటర్లు అవస్థలు పడ్డారు. అక్కిరెడ్డిపాలెం హైస్కూల్లో ఓటు వున్న పలువురు ఓటర్లు గాజువాక హైస్కూల్‌కు, ఇక్కడ ఓటు వున్న మరి కొంత మంది ఓటర్లు అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌కు తిరగడం కనిపించింది.
- పోలింగ్‌కు వచ్చిన కొంత మంది ఓటర్లు పోలింగ్ స్టేషన్ల వద్ద భారీ క్యూలైన్‌లు ఉండటంతో తిరిగి వెళ్లిపోయారు. ఎండ ప్రభావం తగ్గిన తరువాత మరి కొంత మంది వచ్చి ఓట్లు వేశారు.

అక్కిరెడ్డిపాలెం పరిధిలో..

అక్కిరెడ్డిపాలెం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రశాంతంగా జరిగింది. సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు జరిగిన పోలింగ్‌లో పలువురు ఉద్యోగులు, విద్యార్థులు, గృహిణులు, వ్యాపారులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు పోలింగ్ సరళిని సమీక్షించారు. 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి, వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బోగాది సన్యాసిరావు ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్, ఎన్నికల ప్రత్యేక అధికారులు, గాజువాక రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సహకారంతో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

పెదగంట్యాడ పరిధిలో..

పెదగంట్యాడ: మండలంలోని మూడు కేంద్రాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఏర్పాటు చేశారు. నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్, బాల చెరువు ఎంపీపీ పాఠశాల, దుర్గవానిపాలెం ఎంపీపీ పాఠశాలలో బూత్‌లు ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, సాయంత్రం 4 గంటల తర్వాత కూడా ఇక్కడ పోలింగ్ కొనసాగింది. ఈ కేంద్రాలను సౌత్ డీసీపీ ఆనందరెడ్డి, హార్బర్ ఏసీపీ శిరీష, మండల తహసీల్దార్ రమాదేవి పర్యవేక్షించారు. నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్ రెడ్డి, ఎమిలీ జ్వాల దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.

కూర్మన్నపాలెం పరిధిలో..

కూర్మన్నపాలెం : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతం ముగిసింది. ముఖ్యంగా వడ్లపూడి కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పలు పోలింగ్ బూత్‌ల వద్ద ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు జరిగింది. గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కూర్మన్నపాలెం పరిధిలోని రూట్ నెంబర్ 1లో కణితి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 5 పోలింగ్ స్టేషన్లకుగాను మొత్తం 5020 ఓట్లకుగాను 3228 ఓట్లు పోలయ్యాయి. పోలింగ్ ముగిసే సమయానికి 64.30 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల తీరును గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, గాజువాక వైఎస్సార్‌సీపీ కన్వీనర్ తిప్పల దేవన్‌రెడ్డి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ అదనపు కార్యదర్శి దామా సుబ్బారావు పరిశీలించారు. క్రైమ్ డీజీపీ గంధం నాగన్న, గాజువాక ఏసీపీ త్రినాథ్, దువ్వాడ సీఐ శ్రీనివాసరావు పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పర్యవేక్షించారు.


అక్కిరెడ్డిపాలెం జెడ్పీహెచ్ స్కూల్లో పోలింగ్ సరళిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి


పోలింగ్ బూత్ వద్ద క్యూలైన్‌లో ఓటర్లు


గాజువాక హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు


గాజువాక హైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రంలో టీడీపీ అభ్యర్థి చిరంజీవి తదితరులు


దివ్యాంగ ఓటర్‌ను ట్రైసైకిల్‌లో తీసుకెళ్తున్న ఉద్యోగి


ఓటు హక్కు వినియోగించుకున్న తిప్పల దేవన్‌రెడ్డి, ఎమిలీ జ్వాల దంపతులు


ఓటు వేసి బయటకు వస్తున్న దివ్యాంగురాలు


ఎన్నికల తీరును పరిశీలిస్తున్న క్రైమ్ డీజీపీ నాగన్న


ఎన్నికల బందోబస్తులో పోలీస్ అధికారులు


గాజువాక హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో హుస్సేన్


అక్కిరెడ్డిపాలెం జెడ్పీహెచ్ స్కూల్ వద్ద కార్పొరేటర్ అనూషతో చర్చిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు


ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న సౌత్ డీసీపీ ఆనంద్‌రెడ్డి, హార్బర్ ఏసీపీ శిరీష


పోలింగ్ కేంద్రం వద్ద పర్యవేక్షిస్తున్న తహసీల్దార్ రమాదేవి

గాజువాక నియోజకవర్గంలో పోలైన ఓట్ల వివరాలు

పోలింగ్ బూత్‌లు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు
207	1110	665
216	1350	747
217	1390	856
218	1070	613
213	819	569
213ఎ	668	382
214	1380	756
215	1080	694
210	1040	711
210ఎ	960	548
211	1025	631
211ఎ	1005	579
212	1270	759
208	1230	786
209	1090	639
204	1370	955
205	1230	776
206	1210	745
మొత్తం	20,297	12,411


ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం రోడ్డును మూసేసిన పోలీసులు


వైఎస్సార్‌సీపీ శిబిరంలో ఎమ్మెల్యే నాగిరెడ్డి సేవలు


గాజువాక హైస్కూల్ వద్ద బీజేపీ నాయకులతో ఆ పార్టీ అభ్యర్థి మాధవ్

పైడిమాంబ జాతర నేడు

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు నడుపూరు గ్రామదేవత పైడిమాంబ అమ్మవారి జాతర మంగళవారం జరగనుంది. ఆలయంతో పాటు గ్రామంలోని ప్రధాన రహదారిని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారి ఆలయానికి వెళ్లే రోడ్డులో ప్రత్యేకంగా ఆర్చ్‌లను తీర్చిదిద్దారు. జాతరలో భాగంగా ఉత్సవ కమిటీ చైర్మన్లు ములగపాక అచ్చింనాయుడు, మంత్రి శంకరనారాయణ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ 7న ఉత్సవాలకు శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా అమ్మవారికి విశేష పూజలు, అర్చనలు చేయడంతో పాటు ఘటాలను వీధుల్లో ఊరేగిస్తున్నారు. జాతరను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ రాయభారం, సత్యహరిశ్చంద్ర తదితర నాటకాలతో పాటు పిట్టలదొర అనే హాస్యవల్లరి, సినీ డూప్స్, బుర్రకథ, రేలారే రేలా తదితర కార్యక్రమాల ప్రదర్శనలు అలరించాయి. జాతరకు ముందు రోజు సోమవారం సాయంత్రం నుంచి పరస ప్రారంభమైంది. మంగళవారం మేళతాళాలు, మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవారి అనుపు ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు.


విద్యుత్ దీపాల అలంకరణలో నడుపూరు

రైతుబజార్లను పరిశుభ్రంగా ఉంచాలి

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో సోమవారం జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ ఆకస్మిక తనిఖీలు చేశారు. రైతుల స్టాళ్ల వద్దకు వెళ్లి ఐడీ కార్డులు, ధరల పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుబజార్‌ను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో వినియోగదారులు కూరగాయలు కొనుక్కునేలా చూడాలని, సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. కూరగాయల విక్రయాల్లో ఎటువంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వినియోగదారులతో స్నేహపూర్వకంగా మెలగాలని రైతులకు సూచించారు. డ్వాక్రా స్టాళ్లలో సంబంధిత మహిళలే ఉండాలన్నారు. ఆకుకూరల రైతులు యాసిన్‌కు తమ సమస్యలు విన్నవించుకున్నారు. రైతుబజార్ ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ పాల్గొన్నారు.


రైతుబజార్‌లో తనిఖీ చేస్తున్న మార్కెటింగ్ శాఖ అధికారి యాసిన్

డంపింగ్ యార్డుల పరిశుభ్రతకు చర్యలు

జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్ – 2 పరిధిలోని కాపులుప్పాడ డంపింగ్ యార్డు, చెత్త నుంచి విద్యుత్ తయారు చేస్తున్న జిందాల్ విద్యుత్ ప్లాంట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా తక్షణ చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. జీ 20 సదస్సుకి వచ్చే వివిధ దేశాల ప్రతినిధులు ఇక్కడకు రానున్నందున అధికారులతో కలిసి సోమవారం ఆయన క్షేత్ర స్థాయి పర్యటన చేశారు. ఇప్పటికే నగరంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. పలు దేశాల ప్రతినిధులు నగరంలోని ప్రాజెక్టులు వీక్షిస్తారని, అందుకు ఆయా ప్రాంతాలను మరింత శుభ్రంగా ఉంచాలని సూచించారు. జిందాల్ విద్యుత్ ప్లాంట్ వద్ద టాయిలెట్లు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, పారిశుధ్య పనులు పక్కాగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ వి.సన్యాసిరావు, జోనల్ కమిషనర్ కనకమహాలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా కాలువలు

అగనంపూడి: స్థానిక ఏరియా ఆస్పత్రి ఎదుట ఉన్న ప్రధాన కాలువలు శిథిలమై ప్రమాదకరంగా తయారయ్యాయి. జాతీయ రహదారి అగనంపూడి కూడలి నుంచి ఆస్పత్రి గేటు వరకు ఉన్న డ్రైనేజీలు శిథిలమై రోడ్డు నాలుగు నుంచి ఐదు అడుగుల వరకు కోతకు గురైంది. దీంతో ఆటోలు, బైకులపై ఆస్పత్రికి వచ్చే వారు భయాందోళన చెందుతున్నారు. ఆస్పతి దాటిన వెంటనే ఉన్న సిగ్నల్ పాయింట్ వద్ద వాహనాలు మూడు వరుసల్లో నిలిచిపోతుండడంతో, ఆటోలు, ద్విచక్రవాహనాలు రోడ్డు అంచుల్లో ప్రయాణం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో రోడ్డు కోతకు గురైన విషయం తెలియని వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. డ్రైనేజీ రెండు అడుగుల వెడల్పు, ఐదడుగుల లోతులో ఉండడంతో వాహనచోదకులు భీతిల్లుతున్నారు. భారత జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్‌ఏఐ) అధికారులు స్పందించి ఆస్పత్రి గేట్ల వద్ద డ్రైనేజీలను పునర్నిర్మించాలని స్థానికులు, రోగులు కోరుతున్నారు.



జాతీయ రహదారి అగనంపూడి ఆస్పత్రి రెండు గేట్ల ముందున్న శిథిల డ్రైనేజీలు

విలువలతో కూడిన విద్యా బోధన అవసరం

బీచ్ రోడ్డు: విద్యార్థులకు విలువలతో కూడిన విద్యా బోధన అవసరమని జోన్–1 ఆర్ఎఫ్‌వో డి.నిరంజన్‌రెడ్డి అన్నారు. పెద్దవాల్తేరులోని సన్ ఫ్లవర్ స్పెషల్ స్కూల్ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, అనాథలకు మంచి విద్యను అందించేందుకు కొన్నేళ్లుగా కృషి చేస్తున్న స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ వేడుకల్లో భాగంగా దివ్యాంగులు ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఫీల్డ్ జీఎం ప్రసాద్, రాణా ఉప్పలపాటి, పాలిక శ్రీనివాస్ పాల్గొన్నారు.

760వ రోజుకు చేరుకున్న ఉక్కు దీక్షలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద తలపెట్టిన ఉక్కు రిలే నిరాహార దీక్షలు 760వ రోజుకు చేరుకున్నాయి. ఈ శిబిరంలో సోమవారం ప్లాంట్‌లోని పలు విభాగాలకు చెందిన కార్మికులు కూర్చుని కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా దేశ ప్రజలు ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా కళ్లు తెరిచి ప్రభుత్వ రంగ సంస్థల జోలికి రాకుండా ఉంటే మంచిదన్నారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటించాలని, లేదంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.


760వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

మానవ హక్కుల పరిరక్షణలో విఫలం

డాబాగార్డెన్స్: మానవ హక్కుల పరిరక్షణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమవుతున్నాయని మానవ హక్కుల కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వాల నిర్లక్ష్య వైఖరి కారణంగానే తరచూ మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతున్నాయన్నారు. దీనిని అరికట్టేందుకు ప్రభుత్వాలు పటిష్ట చర్యలు తీసుకోవల్సిన అవసరం ఉందన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ల పనితీరు దారుణంగా ఉందన్నారు. ఆ కమిషన్ల వల్ల ప్రజలకు పెద్దగా ప్రయోజనాలు చేకూరడం లేదన్నారు. మానవ హక్కుల్లో ప్రధానంగా జీవించే హక్కుని ప్రజలు కోల్పోతున్నారని అన్నారు. భావితరాలు మనుగడ సాధించాలంటే పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. మానవ హక్కులపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించేందుకు తాము నిరంతరం కృషి చేస్తూనే ఉన్నామని చెప్పారు.


మానవ హక్కుల పరిరక్షణకు సంబంధించి గణాంకాలు చూపుతున్న శ్యాంప్రసాద్